



బోధన్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- స్టాక్ నిల్వలలో తేడాతో దుకాణ డీలర్‌పై కేసు

బోధన్‌రూరల్, మే 31: పట్టణంలోని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలను శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ నిల్వలలో తేడా, ఇతర వివరాలను నమోదులో లోటుపాట్లు కలిగిన ఓ దుకాణ డీలర్‌పై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కూడిన బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నకిలీ, నాసిరకం విత్తనాలు ఎరువుల కారణంగా ఎక్కడ కూడా ఏఒక్క రైతు నష్టపోకుండా క్షేత్రస్థాయిలో పకడ్బంది పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకుని రెండు రోజుల్లోపు అన్ని దుకాణాలలో క్షుణ్ణంగా తనిఖీలు పూర్తి చేసి తనకు నివేదిక అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ముందుగా బోధన్ పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో గల ఏవీ నారాయణ రావు అండ్ కంపెనీ ఎరువులు, విత్తనాల షాపును తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్, ఇన్ వాయిస్ బుక్, బిల్ బుక్‌లను విత్తన బస్తాలపై లాట్ నెంబర్, ఎంఆర్‌పీ రేటు, బ్యాచ్ నెంబర్, గడువు తేది తదితర వివరాలను పరిశీలించారు. ఎరువులు, విత్తన అమ్మకాలకు తగిన అనుమతులు పొందిన పత్రాలను పరిశీలించి దుకాణదారులకు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ అండ్ కంపెనీ విత్తన, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్‌లో ఈ పాస్ నమోదు వివరాలలో తేడా ఉండడాన్ని గుర్తించిన కలెక్టర్ ఈ విషయమై డీలర్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం రాలేకపోయింది. అంతే కాకుండా స్టాక్ రిజిష్టర్ బిల్ బుక్‌లో వివరాల నమోదులోనూ లోటుపాట్లు ఉందని గమనించిన కలెక్టర్ శ్రీనివాస్ అండ్ కంపెనీపై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్, జిల్లా విత్తన అభివృద్ధి సంస్థ అధికారి శ్రీ కర్, ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్ ఉన్నారు.

రైస్‌మిల్లర్లలో అలజడి

- ధాన్యం కేటాయింపుల్లో అవకతవకలపై డీఎస్‌వో, డీఎం సస్పెన్షన్
- సంబంధిత జిల్లా అధికారుల్లో మొదలైన టెన్షన్
- లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం

నిజామాబాద్ అర్బన్, మే 31: రైస్‌మిల్లర్లకు ధాన్యం కేటాయింపుల్లో జరిగిన అక్రమాలపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాశ్, ఇన్‌చార్జి మేనేజర్ జగదీశ్ కుమార్‌లను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడంతో జిల్లాలోని రైస్‌మిల్లర్లలో అలజడి నెలకొంది. జిల్లాలో 2021-22, 2022-23 ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించి 37వేల టన్నుల ధాన్యం మాయమైన ఘటనపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ధాన్యం కేటాయింపుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి దానికి బాధ్యులుగా డీఎస్‌వో, సివిల్ సప్లయిస్ మేనేజర్లపై సస్పెన్షన్ వేటు వేసింది. దీంతో గత కొద్దికాలంగా ధాన్యం కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్లర్లలో భయం నెలకొంది. అధికారుల అండతో అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్లర్లు ఇప్పుడు తమ అక్రమాలు ఎక్కడ బయటపడుతాయోనన్న ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. సామర్థ్యం లేకున్నా ధాన్యం కేటాయింపుల్లో అధికారులు తమకు నచ్చిన విధంగా ప్రజాప్రతినిధుల అండతో అక్రమాలకు పాల్పడినట్లు అనేక ఆరోపణలు వచ్చాయి. జిల్లాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి అండతో ధాన్యం కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్లు అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ విషయాన్ని నూతనంగా ఏర్పడ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కలెక్టర్ విచారణ జరిపి ధాన్యం కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్లు పౌరసర ఫరాల కమిషనర్‌కు నివేదిక ఇవ్వడంతో ఈ కేటాయింపుల్లో ప్రమేయం ఉన్న డీఎస్‌వో, డీఎంపై సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెన్షన్ వేటుతో పాటు ధాన్యం కేటాయింపుల్లో జరిగిన అక్రమాలపై మరింత లోతుగా విచారణ జరిపే అవకాశం ఉండటంతో అక్రమాలకు పాల్పడ్డ అధికారులు, రైస్‌మిల్లర్లలో టెన్షన్ మొదలైంది.



మేడ్చల్, మల్కాజ్‌గిరి అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు..


ధాన్యం కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడిన డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లై జనరల్ మేనేజర్ జగదీశ్‌కుమార్‌లపై సస్పెన్షన్ వేటు వేయడంతో వారి స్థానంలో మేడ్చల్, మల్కాజ్‌గిరికి చెందిన డీఎస్‌వో, డీఎంలకు జిల్లా ఇంచార్జి బాధ్యతలను అప్పగించారు. వారు ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

ధాన్యం కేటాయింపుల్లో అక్రమాలు ఇవే..

జిల్లాలో 2021-22, 2022-23 ఖరీఫ్ సీజన్‌కు గాను సీఎంఆర్ కోసం బోధన్ చుట్టుపక్కల ఉన్న అమీర్ ఆగ్రో పార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాహిల్ ఫుడ్స్ క్యాటరింగ్ సర్వీసెస్, రాస్ ఫుడ్స్ క్యాటరింగ్ సర్వీసెస్, దాన్విక్ ఆగ్రో మిల్స్, సైరస్ ఆగ్రో ఇండ స్ట్రీస్‌లకు మొదట సీఎంఆర్ కింద ధాన్యం కేటాయిం చారు. కానీ నిర్ణీత గడువులోపు సీఎంఆర్‌ను అందిం చాల్సి ఉండగా మిల్లింగ్ చేయలేదు. ఈ ధాన్యాన్ని వేరే మిల్లర్లకు కేటాయించాలని తమ వల్ల కాదని ఐదు రైస్ మిల్లులు అధికారులను కోరగా జిల్లా అధి కారులు ఇతర ఏడు రైస్‌మిల్లులకు ఆ ధాన్యాన్ని బదిలీ చేస్తూ నిర్ణీత గడువులోగా మిల్లింగ్ చేయాలని ఆదేశించారు. కానీ ఏడు మిల్లుల సామర్థ్యాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఆ రైస్‌మిల్లుల కు పరిమితికి మించి ధాన్యాన్ని కేటాయించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలనకు వెళ్లినప్పుడు మొదట కేటాయించబడిన ఐదు రైస్‌మిల్లుల్లో గానీ, తర్వాత కేటాయించిన ఏడు రైస్‌మిల్లులలో ధాన్యం కనిపించలేదు. ఈ విషయంలో జిల్లా అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించడంతో పౌరసరఫరాల కమిషనర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈ ఐదు రైస్‌మిల్లులకు, తర్వాత ఏడు రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం 37వేలకు పైగా టన్నులు ఉండగా దాని విలువ సుమారు 72 కోట్లకు పైగా ఉంది. మొదట్లో కేటాయించిన మిల్లులకు జరిమానా విధించిన అధికారులు ధాన్యాన్ని బదిలీ చేయించుకున్నట్లుగా అంగీకార పత్రాలు ఇచ్చిన రైస్ మిల్లులకు కేసులు కూడా నమోదు చేశారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం బదిలీ ఒప్పందాన్ని అంగీకరించి ధాన్యాన్ని బదిలీ చేయలేనట్లు తెలిసింది. ఈ విషయమై ఓ మాజీ ప్రజాప్రతినిధికి చెందిన రైస్ మిల్లులకే సామర్థ్యం లేకున్నా ధాన్యం కేటాయింపులు జరిగినట్లు గతంలో ఆరోపణలు వచ్చాయి.

మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం..

జిల్లాలో సామర్థ్యం లేకున్నా ధాన్యం కేటాయింపుల్లో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఇష్టారాజ్యంగా తమకు నచ్చిన రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేసినట్లు తెలుస్తుంది. సామర్థ్యం లేకున్నా అసలు రైస్‌మిల్లులే లేకున్నా ధాన్యం కేటాయింపులు చేసినట్లు తెలుస్తోంది. కొందరు రైస్‌మిల్లర్లు అధికారులతో ములాకత్తై కొన్ని రైస్‌మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయింపులు అధికంగా చేయించుకున్నట్లు సమాచారం. డీఎస్‌వోతో పాటు సివిల్‌సప్లై మేనేజర్‌పై సస్పెన్షన్ వేటు పడటంతో గతంలో అక్రమాలకు పాల్పడ్డ రైస్‌మిల్లర్లలో భయం మొదలైంది. విచారణ జరిపితే తాము కూడా బయటపడే అవకాశాలు ఉన్నాయనే భయంతో రైస్‌మిల్లర్లు ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులపై వేటు వేసిన ప్రభుత్వం సీఎంఆర్ కేటాయింపులో జరిగిన అక్రమాలపై మరింత లోతుగా విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.



● బ్యాక్ వాటర్ తీర ప్రాంతంలో పక్షుల సంచారం

ఎకో టూరిజం
ప్రతిపాదనలకే పరిమితం!

ప్రారంభమైతే స్థానికంగా ఉన్న నందిపేట్, డొంకేశ్వర్ మండలాలు అభివృద్ధ చెందుతాయి. పర్యాటకుల తాకిడి ఇప్పటికే ఎక్కువ అవడంతో తీర గ్రామాలకు కొంతమేర ఆదాయం లభిస్తుంది. స్థానిక యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయి. రిసార్ట్‌లే కాకుండా ప్రభుత్వం 40కిలోమీటర్ల మేర బోటింగ్ ఏర్పాటు చేయనుండడంతో మరింత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. నందిపేట్, డొంకేశ్వర్ మండలాల మీదుగా నది ప్రవహిస్తుండడంతో అక్కడ తీరప్రాంత గ్రామాలకు ఎంతోలాభం చేకూరనుంది. ఇప్పటికే గోదావరి తీరప్రాంతంలో ఫ్లెమింగో, ఇతర దేశాల పక్షులు వలస వస్తుండడంతో ఆ తీర ప్రాంతం కొత్తశోభను సంతరించుకుం టుంది. వేసవికాలం మొత్తంగా తీర ప్రాంతం మొత్తం విదేశీ పక్షులతో పర్యాటకులను కట్టిపడేస్తుందని, వీటితోపాటు వివిధ రకాల అరుదైన జింకలు అటు ఇటు పరుగెడుతూ సందడి చేస్తుండడంతో పర్యాటక అభివృద్ధి తప్పనిసరైంది.

- ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తీర ప్రాంతంలో ఎకో టూరిజం ఏర్పాటు మరింత ఆలస్యం
- ఇంకా పూర్తికాని డిజైన్ అప్రూవల్, అర్కిటెక్ టెండర్లు
- టూరిజం మొదలైనట్టేనని జిల్లా అటవీ అధికారుల ప్రచారం
- మరింత ఆలస్యం అవుతుందంటున్న ఉన్నతాధికారులు

సుభాష్‌నగర్, మే 31: జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తీర ప్రాంతంలో ఎకోటూరిజం ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. రెండు సంవత్సరాలుగా ఎకో టూరిజం అంటూ ఊదరగొడుతున్న అటవీ శాఖ అధికారులు అక్కడ ఎలాంటి పనులకు శ్రీకారం చుట్టలేదు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తీర ప్రాంతంలో అరుదైన పక్షులు, జింకలు సంచరిస్తుండడంతో పర్యాటకుల సందడి పెరిగింది. దీంతో జిల్లా అటవీశాఖ అధికారులు గోదావరి బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి చేయాలన్న ప్రణాళికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. అయితే రెండేళ్లుగా టూరిజం ప్రతిపాదనల ప్రకియ సాగుతూనే ఉంది. హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులు పలుమార్లు వచ్చి ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు స్థలాన్ని సేకరించారు. నందిపేట్ మండలం ఉమ్మెడ బ్రిడ్జి పక్కన కొంత భూమిని, డొంకేశ్వర్ మండలం చిన్నయానం ప్రాంతంలో మరికొంత భూమిని సేకరించారు. మొదటగా 18 ఎకరాలు సేకరించారు. అనంతరం సరిపోదని 26 ఎకరాలు భూమిని సేకరించారని ఇక్కడి అటవీశాఖ అధికారులు గతంలో తెలిపారు. కానీ అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ అధికారులు మాత్రం కేవలం 5ఎకరాల భూమినే కేటాయించినట్లు చెబుతున్నారు. ఉమ్మెడ ప్రాంతంలో 2 ఎకరాలు, చిన్నయానం ప్రాంతంలో 3ఎకరాలు సేకరించినట్లు చెబుతున్నారు.

అభివృద్ధి చెందనున్న తీరప్రాంతం..

గోదావరి నది బ్యాక్ వాటర్ తీర ప్రాంతంలో ఎకో టూరిజం

ఇంకా పూర్తికాని డిజైన్ అప్రూవల్, అర్కిటెక్ టెండర్లు..

టూరిజం ఏర్పాటు ప్రాంతంలో అవసరమైన రిసార్ట్‌ల అర్కిటెక్ డిజైన్‌లు కాలేదు. వాటికి ఇప్పటి వరకు అప్రూవల్ రాలేదు. కానీ స్థానిక అధికారులు మాత్రం నిధులు త్వరలోనే వస్తాయని చెబుతున్నారు. ఎలాంటి అర్కిటెక్ డిజైన్‌లు కాకుండానే నిధులు ఎలా వస్తాయని అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. టూరిజం కోసం మొదటగా స్థలాన్ని ఆ ప్రాంతంలో అర్కిటెక్ డిజైన్‌లు చేయించిన తర్వాత ఉన్నతాధికారుల ఆమోదం పొందాల్సి ఉంటుంది. అనంతరం వాటిని నిర్మించడానికి అయ్యే ఖర్చును ఖరారు చేసి టెండర్లకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఇదంతా ఏమీ జరగకుండానే స్థానిక అటవీశాఖ అధికారులు ఎకో టూరిజం పనులు మొదలైనట్లు జోరుగా ప్రచారం చేస్తున్నారు.

పనులు త్వరగా ప్రారంభించాలి : నక్కల భూమేష్, స్థానికుడు

ఏకో టూరిజం పార్కు ఏర్పాటు చేస్తామని రెండు సంవత్సరాలుగా అధికారులు చెబుతున్నారు. తర్వగా పనులు ప్రారంభించాలి. ఎకో టూరిజం పార్కు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నాం : శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వో

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తీర ప్రాంతంలో ఎకో టూరిజం ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. ప్రస్తుతానికి 5ఎకరాల భూమిని జిల్లా అధికారుల సహాయంతో తీసుకున్నాం. టూరిజానికి కావాల్సిన రిసార్ట్‌లు అర్కిటెక్ డిజైన్‌లు చేయాల్సి ఉంది. ఆ తర్వాత టెండర్లు ప్రక్రియ పూర్తియిన వెంటనే టూరిజం పనులు ప్రారంభిస్తాం.



● జింకల సంచారం



స్కూల్ బస్సులతో.. భద్రం



- కాలం చెల్లిన బస్సులతో పిల్లల భద్రత కరువు
- ఫిట్‌గా లేకున్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్
- మాముళ్ల మత్తులో అధికారులు
- పాఠశాలల పునఃప్రారంభానికి మరో 11 రోజులే గడువు
- జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు చెందినవి 500 బస్సులు

జిల్లాలో ఏటా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే యథేచ్ఛగా తిరుగుతున్నాయి. అధికారుల అరకొర తనిఖీలతో పాఠశాల యాజమాన్యాలు పిల్లల భద్రతను గాలికొదిలేస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా కాలం చెల్లిన వాహనాలను కొనుగోలు చేస్తూ వాటిలో పిల్లలను బడికి తీసుకెళ్తున్నారు. అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాల్సిన అగ్నిమాపక, ఫస్ట్ ఎయిడ్ సామగ్రి కనిపించకుండా పోతున్నాయి.

బోధన్‌రూరల్, మే 31: ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. నెల రోజులుగా షెడ్‌లో ఉన్న ప్రైవేటు పాఠశాలల బస్సులు రోడ్డెక్కేందుకు సిద్ధమవుతున్నాయి. జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు చెందిన 500బస్సులు ఉన్నాయి. బోధన్ డివిజన్‌లో సుమారు 60బస్సులు ఉన్నాయి. వీటి ఫిట్‌నెస్ గడువు ఈ నెల 15తో ముగిసింది. ఈ వార్షిక సంవత్సరం రోడ్డెక్కాలంటే ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు తీసుకోనున్న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ 2025 మే 15వరకు ఉంటుంది. ప్రతి బస్సు ఆర్టీఏ కార్యాలయానికి తీసుకురావాల్సి ఉంటుంది. ఆర్టీఏ అధిఆరులు బస్సుల ఫిట్‌నెస్ పరిశీలించి సర్టిఫికెట్స్ జారీ చేయడం నిబంధన. మరో పదకొండు రోజుల్లో రోడ్డెక్కనున్న ప్రతి బస్సుకు ఫిట్‌నెస్ జారీ చేసి ఉంటుంది. బస్సులు ఎంత ఫిట్‌గా ఉన్నాయో తెలియదు కాని సర్టిఫికెట్స్ జారీ పేరిట అధికారులు భారీగానే ముడుపులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల ధన దాహంతో కాలం చెల్లిన బస్సులు రోడ్డెక్కుతూ ప్రమాదాలకు గురవుతున్నాయనే విమర్శలున్నాయి.



బస్సు పరిశీలించాకే సర్టిఫికెట్ : ఎంవీఐ శ్రీనివాస్, బోధన్

బస్సును పరిశీలించాలకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తున్నాము. కార్యాలయానికి రాని బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ ఇచ్చే ప్రసక్తే లేదు. యేడాదిగా నగరంలో పాఠశాలల బస్సులు ప్రమాదాల బారిన పడిన దాఖలాలు లేవు. శాఖ అధికారులు ఎవరు అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటాం. బస్సు డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. శాఖ నిబంధనలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శాఖపరంగా అవగాహన కలిగిస్తాం. జూన్ మొదటి వారంలో డ్రైవర్లకు శిక్షణ తరగతులు ఉంటాయి.

నిబంధనలు పాటించాలి..

పాఠశాలల బస్సుల్లో ఆర్టీఏ నిబంధనల మేరకు పలు సౌకర్యాలు కల్పించాలి. బస్సు నడిపే డ్రైవర్ 50యేళ్ల వయస్సు దాటరాదు. ప్రమాదాలు జరిగినప్పుడు తప్పించుకునేందుకు ఎమర్జెన్సీ డోర్ ఉండాలి. బస్సులో ప్రథమ చికిత్స అందించేందుకు మెడికల్ కిట్ ఉండాలి. ఫైర్ సెఫ్టీ కిట్, హ్యాండ్ బ్రేక్, డ్రైవర్ డీటెయిల్స్ తప్పనిసరిగా బస్సులో ఉండాలి. బస్సు 15యేళ్ల సర్వీసు కలిగిఉండాలి. 15ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వాహనానికి మరొక సంవత్సరం రోడ్లపైన తిరిగే అవకాశం కల్పిస్తారు. అదనంగా ఇచ్చే ఒక సంవత్సరం సైతం ఆర్టీఏ అధికారులు ధ్రువీకరిస్తేనే రోడ్డెక్కాల్సి ఉంటుంది. 16యేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వాహనాలు రోడ్డెక్కే అవకాశం ఉండదు. ఆ వాహనాన్ని స్క్రాబ్‌కు విక్రయించాల్సి ఉంటుంది. ప్రతి స్కూల్ బస్సు 30కిలో మీటర్ల పరిధిలో మాత్రమే తిరుగాల్సి ఉంటుంది. దీనికి ప్రతి ఐదేళ్లకోసారి 3400రూపాయలు చెల్లించి పర్మిట్ తీసుకోవాల్సి ఉంది. నగరంలో పలు కార్పొరేట్ పాఠశాలలకు పదుల సంఖ్యలో బస్సులు ఉన్నాయి. డ్రైవర్స్‌ను పెట్టుకుని నడిపిస్తుంటారు. కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలలో పలుకుబడి ఉన్న వ్యక్తులే ఎక్కువగా ఉన్నారు. కార్పొరేట్ పాఠశాలల బస్సులు ఆర్టీఏ కార్యాలయం రాకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికేట్స్ జారీ అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

ఫిట్ లేకున్నా సర్టిఫికెట్!

ఫిట్‌గా లేకున్నా ఫిట్‌నెస్ సర్టిఫికేట్స్ ఇస్తున్నారనే అపవాదు ఆర్టీఏ అధికారులపై ఉంది.





పెర్కిట్‌లో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఆర్మూర్‌రూరల్, మే31: ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిజామాబాద్ జిల్లా ఆదివాసి నాయకపోడు విద్యార్థులకు ప్రతిభ పురస్కరాలను అందజేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన జీసీడీవో సింగం అనిత, మంతెన రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఆదివాసి నాయకపోడు సంఘం అధ్యక్షుడు బండారి బోజన్న, ఉద్యోగుల సేవ సంఘం అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆ దివాసి నాయకపోడు విద్యార్థిని విద్యార్థులకు చదువు విషయంలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలిచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్య క్షుడు గాండ్ల రాంచందర్, గడ్డం శంకర్, లోలం గంగాధర్, శానం ప వన్, దాత్రిక అంజయ్య, మూడ అశోక్, పోసడుగు రవి, నవీన్, అయిలాపూర్ రాజు, గంట గంగాధర్, రాంప్రసాద్, సురేష్ రుక్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్,మే31: బోదన్ పట్టణంలోని అనిల్ టాకీస్ చౌరస్తా వద్ద గల కెనాల్‌లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని బోధన్ పట్టణ సీఐవీరయ్య తెలిపారు. మృతదేహన్ని జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతదేహనికి సంబంధించి ఎటువంటి ఆచూకీ లభించలేదన్నారు. మృతదేహన్ని జిల్లాఆసుపత్రిలో భద్రపర్చామన్నారు.

అర్గుల్‌లో రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ

జక్రాన్‌పల్లి, మే31: మండలంలోని అర్గుల్ గ్రామంలో సింగిల్‌విండో కార్యా లయంలో శుక్రవారం రైతులకు జీలుగ విత్తనాలను అధికారులు పంపిణీ చేశారు. అంతకు ముందు వ్యవసాయాధికారిణి దేవిక జీలుగ విత్తనాల పం పిణీ తీరును పరిశీలించారు. అర్గుల్ సింగిల్‌విండో పరిధిలోని వివిధ గ్రామాల రైతులకు ఒక బస్తా రూ.1116లకు విక్రయించాలని తెలిపారు.

పొగాకు వాడకంతో ఆరోగ్య సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రమోదిత

రెంజల్,మే31: సిగరేట్, పొగాకు, గుట్కా ఉత్పత్తుల ద్వారా తయారయ్యే వాటిని తాగడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలకు కారణం అవుతాయని ముఖ్యంగా వీటి ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్, గొంతు క్యాన్సర్, చర్మ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, పొగాకు ఉత్పత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ప్రమోదిత అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని కూనేపల్లి, వీరన్న గుట్ట గ్రామాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయని వీటికి దూరంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, పొగాకు ఉత్పత్తులు ఇకనైనా మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీరణ అధికారి కరిపె రవీందర్, పంచాయతీ కార్యదర్శులు రాజు, కృష్ణ, వెంకట రమణ, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● పొగాకుపై అవగాహన

డొంకేశ్వర్: అతిప్రమాదకరమైన పోగాకు గుట్కా అలవాటు పడి క్యాన్సర్ బారిన పడవద్దని సూపర్‌వైజర్ సురేందర్ అన్నారు. గురువారం డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ డే సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. క్యాన్సర్‌పై కలిగే అన ర్థాలపై వివరించారు. క్యాన్సర్ వ్యాధి అతి ప్రమాదకరమైందని అన్నారు. పోగాకు శరీర అవయాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంపాసియ, క్రానిక్, అబ్జెక్టివ్ లాంటి ప్రమాదకరమైన వ్యా. దులు సోకుతాయని అన్నారు.ఎంఎల్ హెచ్‌పీ అమూల్యసతీష్,ఎల్‌టీ.దిలిప్,తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నవీపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా నేను నా జీవితంలో ఏ రకమైన పొగాకు ఉత్పత్తులను ఉపయోగించనని, నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులను పొగాకు ఉత్పత్తులను ఉపయోగించకూడదని ప్రేరేపిస్తానని ప్రతిజ్ఞ చేశారు. పొగాకు ఉత్పత్తుల వాడకుండా పర్యావరణ రక్షణకు నావంతు సహకరిస్తానని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సు రాజీ, సూపర్‌వైజర్ కిషన్, సిబ్బంది ఉన్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

రుద్రూరు, మే 31: చిక్కడ్‌పల్లి ఊర చెరువులో అక్రమంగా మ ట్టిని తరలి స్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చిక్కడ్‌పల్లి గ్రామ స్తులు శుక్ర వారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజే శారు. గురువారం మధ్యాహ్నం అక్రమంగా మట్టిని తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకుని తహసీల్దార్‌కు సమా చారం అందించారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేశారు. అదే రోజు మళ్ళీ నిర్లక్ష్యంగా కొందరు రాత్రి సమయంలో మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ వినతిపత్రం అంద జేశారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని చిక్కడ్‌పల్లి గ్రామస్తులు తహసీల్దార్‌ను కోరా రు. దీనిపై తహసీల్దార్ మాటా్లడుతూ ఎవరైనా అనుమతులు లే కుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల దృష్టి మళ్లించడానికి సీఎం ప్రయత్నం

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, మే 31: రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ సర్కార్ ప్రజాభిప్రాయం తీసుకోకుండా మార్పులు చేర్పులు చేయడం సరికాదని ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని పక్కదోవ పట్టించడానికి ప్రజల దృష్టి మళ్లించడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నాడని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ.. ఎప్పటి నుంచో ప్రజల ఆకాంక్ష అయిన జిల్లాల పేర్లు నిజామాబాద్‌ను ఇందూరుగా, ఆదిలాబాద్‌ను ఎదులపురంగా, వరంగల్‌ను ఓరుగల్లుగా, మహబూబాబాద్‌ను మానుకోటగా, హైదరాబాద్‌ను భాగ్యనగర్‌గా ఏర్పాటు చేయాలని గతంలో డిమాండ్ చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అంటే రైతు రాజ్యమని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు నిన్న రైతుల పై అమానుషంగా పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ అంటేనే రైతుపక్ష పార్టీ అని గతంలో బీఆర్ఎస్ రైతులకు సంకెళ్లు వేస్తే ఏ గతి పట్టిందో రేవంత్ సర్కార్ కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ అంటే కరెంటు కోత అని రేవంత్‌కు రైతుల పై నిజంగా ప్రేమ ఉంటే రైతులకు సరిపడా కరెంటు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని రైతుభరోసా గ్యారంటీని వెంటనే అమలు చేసి రైతులకు, కౌలు రైతులకు 15వేల రూపాయలు వ్యవసాయ కూలీలకు 12వేల రూపాయలను వరిపంటకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యం

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, మే 31: గత పదేళ్లలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ అమరవీరులను, తెలంగాణ కోసం పోరాటం చేసిన అనేక మందిని పట్టించుకోకుండా ఇప్పుడు కేవలం చిహ్నాలు మారుస్తున్నామని పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, గడుగు గంగాధర్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాటం చేసిన అనేక మందిని గత ప్రభుత్వం విస్మరించిందని కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమరవీరులను, తెలంగాణ కోసం పోరాటం చేసిన వారిని అందరిని కలుపుకొని జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ ఉత్సవాలను నిర్వహిస్తుంటే బీఆర్ఎస్‌కు నచ్చడం లేదన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నామమాత్రంగానే జరిగాయని ప్రజలను భాగస్వాములను చేయకుండానే వేడుకలను నిర్వహించారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి గడీల పాలన అని కుటుంబ పాలన అని ఏనాడు అమరులను, మేధావులను పట్టించుకోలేదన్నారు. రుణమాఫీ కూడా వంద శాతం చేస్తామన్నారు. చార్మినార్, కాకతీయ తోరణాలను ప్రభుత్వ చిహ్నం నుంచి తీసివేస్తే ఆందోళన చేస్తామని కేటీఆర్ డ్రామాలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి కేవలం రాజరిక పోకడలను మాత్రమే తీసేస్తామని చెప్పారని దీన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు శేఖర్‌గౌడ్, ముప్పగంగారెడ్డి, భోజన్న, వేణురాజ్, విపుల్‌గౌడ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల సందర్శన



వివరాలు సేకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

వర్ని, మే 31: జాకోర, తగిలేపల్లి, సత్యనారాయణ పురం గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాలలను శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ సందర్శించారు. భవన నిర్మాణాలు, డోర్లు, ఫ్యాన్లు, బాత్‌రూమ్, అడిషనల్ పనులను పర్యవేక్షించారు.పెండింగ్ పనులను విద్యాసంవత్సరం ఆరంభానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనలో చర్యలు చేపట్టాలని సూచించారు.అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీఓవెంకటేశ్వర్లు,ఎంపీవో చందర్, పీఆర్ ఏఈ కిరణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు ఎల్లవేళల అందుబాటులో ఉండాలి



మాక్లూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి

మాక్లూర్, మే 31: పశువులకు సీజన్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా పశువైద్యాధికారి జగన్నాథ చారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశువైద్య శాలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం రైతులకు అంద జేస్తున్న పథకాలను ఎప్పటికప్పుడు వివరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బస్వారెడ్డితో పాటు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

12లోగా పనులు పూర్తి చేయాలి

● కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

ఎడపల్లి, మే 31: మండలంలోని ఆయా గ్రామాలలో ఎంపిక చేసిన పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనులను జూన్ 12 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి, ఏఆర్పీ క్యాంప్ గ్రామాలలోని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. బ్రాహ్మణ్‌పల్లి పాఠశాలను పరిశీలించిన ఆయన అవసరం ఉన్న పనులను చేపట్టి వాటిని నాణ్యతతో నిర్వహించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అవసరం లేని పనులు చేపట్టవద్దని ఆయన సూచించారు. పాఠశాలల అవరణలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షాకాలం ప్రారంభం దృష్ట్యా వర్షపు నీరు, మురికి నీరు పాఠశాల ఆవరణలో నిలువ ఉండకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అనంతరం ఏఆర్పీ క్యాంపు గ్రామంలోని పాఠశాలల్లో చేపట్టిన పనులను పరిశీలించి, పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనులను పాఠశాలల పునఃప్రారంభంలోగా ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్, బోధన్ ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్, ఈఈ దేవిదాస్, ఏఈఈ అక్తర్, తహసీల్దార్ ధన్వాల్, ఎంపిడిఓ శంకర్, మండల విద్యా శాఖ అధికారి రామారావు, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణా రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ప్రగతి పనుల పరిశీలన

బోధన్‌రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ బడులలో కొనసాగుతున్న మౌలిక సదుపాయల కల్పన పనులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు శుక్రవారం పరిశీలించారు. బోధన్ పట్టణంలోని బురుడు గల్లీలో గల ప్రాథమిక పాఠశాలను, ఎడపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఏఆర్పీ క్యాంప్‌లోని ప్రైమరీ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించి ఆయా దశాలలో కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ జరుపాలని అధికారులకు సూచించారు. అత్యవసర పనులను గుర్తిస్తూ యుద్ధ ప్రాతిపదికన వాటిని పూర్తి చేయించాలన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి అన్ని పనులు పూర్తి చేయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడులను వాటి పరిసరాలను శుభ్రం చేయించాలన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా వర్షపు జలాలు మురుగు నీరు పాఠశాల ఆవరణలో నిలువ ఉండకుండా ముందస్తుగానే జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, ఈఈ దేవిదాస్, తదితరులున్నారు.



బ్రాహ్మణ్‌పల్లి పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు

నిజామాబాద్ అర్బన్, మే 31: జూన్ 9న జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఎలాంటి లోటుపాట్లను, గందరగోళానికి తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 12,833 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా 41 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరీక్షల కోసం నియమించిన చీఫ్‌సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు ముందుగానే పరీక్ష కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులు పరిశీలించాలని ఎక్కడ కూడా అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మంచినీరు ఉండేలా చూడాలన్నారు. సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ సమన్వయ కర్త రామ్మోహన్‌రావు, డీఈవో దుర్గాప్రసాద్, డీఐఈవో రవికుమార్, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, పోలీస్, ఆర్టీసీ, రవాణా, వైద్య ఆరోగ్య, పోస్టల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

మోపాల్, మే 31: మోపాల్ మండల కేంద్రంలో ఉన్న ఎరువుల దుకాణంను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. రైతులకు సంబంధించిన ఎరువులలో ఎలాంటి కల్తీ ఉండకూడదని అధికారులు ముందు జాగ్రత్తగా తనిఖీలు నిర్వహించారు. కొన్ని ఎరువుల దుకాణాల్లో కల్తీ ఉన్నట్లు ఫిర్యాదు రావడంతో ముందు జాగ్రత్తగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్, వ్యవసాయ శాఖ అధికారి, ఎస్సైలు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి పరిశీలించారు. రైతులకు కల్తీకి సంబంధించిన మందులు కానీ, ఎరువులు కానీ సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు'

ఖిల్లా, మే 31: లాడ్జీలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదని ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు సూచించారు. నగరంలోని ఒకటవ టౌన్, నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గల లాడ్జీ మేనేజర్లతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. కొత్తవాళ్లకు లాడ్జీలు ఇచ్చే సమయంలో వారి చిరునామా, ఆధార్‌కార్డు పరిశీలించాలన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహించినట్లు తమ దృష్టికి వస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, మే 31: ఈనెల 24 నుంచి ప్రారంభమైన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ముగిసాయి. శుక్రవారం ఉదయం జరిగిన కామర్స్ కెమిస్ట్రీ మొదటి సంవత్సరం పరీక్షకు మొత్తం 6,558 మంది విద్యార్థులకు గాను 6,164 మంది హాజరుకాగా 394 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు మొత్తం 3,166 మందికి గాను 2,999 మంది హాజరుకాగా, 167 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఐఈవో రవికుమార్ తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, మే 31: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్ 1, 2, 3 ఏడీఈలు చంద్రశేఖర్, తోట రాజశేఖర్, వీరేశంలు తెలిపారు. నగరంలోని తిలక్ గార్డెన్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరస్వతీనగర్, గోపాల్‌బాగ్, ద్వారకనగర్, రెడ్‌క్రాస్ ఏరియా, డి-3 సెక్షన్ దుబ్బ పరిధిలో గౌతంనగర్, రైతుబజార్, ఎన్జీవోస్ కాలనీ, జన్మభూమిరోడ్, డి-4 సెక్షన్ పరిధిలో వినాయక్‌నగర్, శ్రీనగర్ కాలనీ, గాయత్రీనగర్, చంద్రనగర్, పద్మనగర్ రోడ్, కోటగల్లి, న్యాల్‌కల్‌రోడ్, సాయికృపానగర్, ఆకుల పాపయ్యరోడ్, డి-1 సెక్షన్ పరిధిలో గాజుల్‌పేట్, శివాజీనగర్, ఆనంద్‌నగర్, సీతారాంనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఖిల్లా, మే 31: నగరంలోని ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారంలోని 300 క్వార్టర్స్ పరిధిలో పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగలక్ష్మి (38) మృతిరాలికి ఇద్దరు కుమారులు గత ఆదివారం కుటుంబ కలహాలతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఇందల్వాయి, మే 31: మండలంలోని ఇందల్వాయి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులకు గత నాలుగు నెలల క్రితం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రస్తుతం ఈ కాలనీలో కనీస వసతులు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. డ్రైనేజీ పూర్తిగా నిండిపోయి మురునీరు బయటకు వస్తుండటంతో వ్యాధిబారిన పడుతున్నట్లు తెలిపారు. పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని వాపోయారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల పక్కనే ఉన్న వ్యవసాయ భూమి యజమాని డ్రైనేజీ నుండి నీరు బయటకు పోకుండా మూసివేయడంతో సమస్య తలెత్తుతుందని అన్నారు. డ్రైనేజీ నీరు బయటకు వెళ్లేందుకు జేసీబీ సహాయంతో కాలువ తీయగా భూ యజమాని అడ్డుకొని నానా బూతులు తిట్టారని కులం పేరుతో దూషించినట్లు వారు తెలిపారు. తమను దూషించిన యజమానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే షాప్ యజమానులపై పీడీయాక్ట్ నమోదు

భీమ్‌గల్ రూరల్, మే31: వ్యాపారులు విత్తన చట్టాలకు లోబడి విక్రయాలు జరపాలని, రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే విత్తనషాప్ యజమానులపై పిడియాక్ట్ నమోదు చేస్తామని సీఐ శ్రీనివాస్ అన్నారు. నకిలీ విత్తనాలు ప్రవేశించకుండా పోలీసు మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం భీమ్‌గల్ పట్టణంలో విత్తన డీలర్ షాప్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సాయికృష్ణ రికార్డులను పరిశీలించారు. విత్తనాలు తీసుకుంటున్న రైతులకు డీలర్‌లు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, ఏఈఓలు లక్‌పతి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: కల్తీ విత్తనాలను విక్రయిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ విత్తన డీలర్లను హెచ్చరించారు. సిరికొండ మండలంలోని విత్తన రసాయనిక ఎరువులను విక్రయించే షాపులను శుక్రవారం మండల టాస్క్‌ఫోర్సు అధికారుల బృందం తనిఖీ చేసింది. విత్తనాలను, పెస్టిసైడ్ మందులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, ప్రతీ కొనుగోలుపై రసీదులు అందజేయాలని సూచించారు. కల్తీ విత్తనాలను విక్రయిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలలో తహసీల్దార్ రవీందర్‌రావు, ఏఎస్సై బాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: ఫర్టిలైజర్ డీలర్‌లు నకిలీ విత్తనాలు, ఎరువులు రైతులకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు ఉంటాయని భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల గ్రామాల్లోని సీడ్ అండ్ ఫర్టిలైజర్ యాజమానులతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కాల పరిమితి దాటిపోయిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను షాపుల్లో ఉంచకూడదని, రైతులకు అమ్మకూడదని సూచించారు. నకిలీ విత్తనాల నిర్మూలనపై డీలర్లకు అవగాహన కల్పించారు. కంపెనీ నుంచి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తీసుకువచ్చే ముందు జాగ్రత్త పడాలని, వ్యవసాయ శాఖ నియమాలు తప్పక పాటించాలని అన్నారు. విక్రయించే ముందు రైతుల వారీగా స్టాక్‌బుక్, రిజిష్టర్ ఉపయోగించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో లుజ్ విత్తనాలు రైతులకు విక్రయించవద్దని, ఎంఆర్‌పీ కన్న ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. డీలర్లు తప్పకుండా స్టాక్‌బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ కమి టీ సభ్యులు ఎస్సై వినయ్ కుమార్, ఏవో నర్సయ్య, తహసీల్దార్ సరిత, మండలంలోని వివిధ గ్రామాల సీడ్ ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. తహసీల్దార్ గజానన్, సీఐ రవికుమార్, మండల వ్యవసాయాధికారి హరికృష్ణ ఒక బృందంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు విత్తనాలు విక్రయించే సమయంలో తప్పనిసరిగా రసీదులు అందజేయాలన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయించినట్టు తమ దృష్టికి వస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ఈ ఖరీఫ్ సాగులో రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలు, సీడ్ కంపెనీల్లో ఎరువులు, విత్తనాలను వ్యవసాయాధికారి దేవిక, ఎస్సై సీహెచ్.తిరుపతి, తహసీల్దార్ కిరణ్మాయిలు కలిసి పరిశీలించారు. అనంతరం పలు ఫర్టిలైజర్, సీడ్ కంపెనీల్లో స్టాక్ రిజిష్టర్‌ను, ప్రాసెసింగ్ యూనిట్‌లను విత్తన ఎరువుల నిల్వలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారిణి దేవిక మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే వారికి పీడీయాక్టు కింద కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులకు ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలన్నారు. డీలర్లు రైతులకు రసీదును అందజేయాలన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలోని కిసాన్ ఆగ్రో ట్రేడర్స్, వరలక్ష్మి ట్రేడర్స్ విత్తనాలు, ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధ రామేశ్వర్, తహసీల్దార్ ధన్వాల్, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణా రెడ్డిలు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాలలో ఉన్న వరి విత్తనాలను, పురుగుమందులు, వాటి రికార్డులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ డీలరు లైసెన్సు కలిగి ఉన్న కంపెనీల వద్దనే వరి విత్తనాలు, పురుగు మందులు కొని వాటిని రైతులకు అమ్మాలని వారు సూచించారు. స్టాకు రిజిస్టార్ మెయింటేన్ చేయని దుకాణ దారులపై శాఖా పరమైన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు.

బీర్కూర్: రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో శ్రావణ్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని బీర్కూర్ తండాలో ఆయన రైతులతో సమావేశమయ్యారు.విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలుకు సంబంధించిన బిల్లులను తప్పనిసరిగా రైతులు డీలర్ల నుంచి పొందాలని, అనంతరం ఆ బిల్లులను ఇంట్లో జాగ్రత్తగా భద్రపరచుకోవాలన్నారు. ఒకవేళ విత్తనాలు నాసిరకం అయినా పంటలు సరిగ్గా పండక పోయినా బిల్లుల ఆధారంతో సదరు డీలర్‌పై చర్యలు తీసుకోవచ్చన్నారు.ఎరువులు విత్తనాలు,పురుగుల మందులకు సంబంధించిన బిల్లులు తీసుకోవడం మరిచిపోవద్దని ఆయన రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో రైతులు,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలలో నకిలి విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తే అలాంటి దుకాణాల యజమాని లైసెన్స్ చట్టా ప్రకారం రద్దు చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి కిషన్ తెలిపారు.శుక్రవారం పిట్లంలోని ర్టిలైజర్ దుకాణాలలో మండల వ్యవసాయశాఖ అధికారి కిషన్, ఎస్సై నీరేష్ కలిసి తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు విత్తనాలు వేసే ముందు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని, విత్తనాలు కొన్నాక దాని బిల్లులు ఉంచాలని, అనుకొని పరిస్థితిలో విత్తనాలు మొలకెత్త కుంటే అలాంటి కంపెనీల వారితో చర్చించి రైతులకు న్యాయం చేస్తామన్నారు.ప్రతీ రైతు విత్తనాలు కొన్న తరువాత తప్పని సరిగా రసీదు తీసుకోవాలని కోరారు.

వేల్పూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



వేల్పూర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ కల్మేశ్వర్

వేల్పూర్, మే31: ఎనిమిల్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా శుక్రవారం వేల్పూర్ పోలీస్ స్టేషన్ నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సింగానివార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని అన్ని గదులను, క్వాటర్స్‌లను పరిశీలించారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ కాల్మేశ్వర్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ నిర్వహణలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. ఏమైన సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి పట్ల గౌరవంగా మాట్లాడాలని సూచించారు. అంతకు ముందు పోలీస్ స్టేషన్‌లో సీపీ కలేశ్వర్ గౌరవ వందనం స్వీకరించారు.. సీపీ వెంట ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి, చైతన్యరెడ్డి, ఆర్మూర్ ఏసీపీబస్వారెడ్డి, సీఐశ్రీధర్‌రెడ్డి, ఎస్సై వినయ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మోర్తాడ్, మే31: మండలంలోని దొన్కల్ జాతీయరహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మోర్తాడ్‌కు చెందిన మార్క వినయ్(16) మృతి చెందగా, అదే గ్రామానిక చెందిన కోరవెల్లి శివకృష్ణ పరిస్థితి విషమంగా ఉందని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం వేకువజామున బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్తుండగా ఆర్మూర్ వైపు నుంచి మంచిర్యాల్ వెళ్తున్న అశోక్ లీలాండ్ వాహనం ఢీకొట్టిందని ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా వారిని 108వాహనంలో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, మార్క వినయ్ చికిత్స పొందుతూ మరణించాడని, శివకృష్ణ పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. అశోక్‌లీలాండ్ నడిపే డ్రైవర్, క్లీనర్‌లకు బలమైన గాయాలయ్యాయని, చికిత్స కొరకు జిల్లా ఆసుపత్రిలో చేర్పించామని ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య



సమావేశానికి హాజరైన కౌన్సిలర్‌లు

ఆర్మూర్‌టౌన్, మే31: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా అత్యవసర పనులు చేపట్టడానికి గాను 39ఏజెండా అంశాలలో సభ్యులు 38ఏజెండా అంశాలను సభ్యులు ఆమోదించి తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ షేక్ మున్ను, డీఈ భూమేశ్వర్, సానిటరీ ఇన్‌స్పెక్టార్ మహేష్, ఏఈ రఘులతో పాటు కౌన్సిలర్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ఇంటి నెంబర్‌ల కేటాయింపుపై చర్యలేవి

గత నాలుగేళ్ళలో ఇష్టరీతిన ఇచ్చిన ఇంటి నెంబర్‌ల కేటాయింపులపై చర్యలు చేపట్టాలని బీజేపీ ఫ్లోర్‌లీడర్ జీవీ.నర్సింహరెడ్డి అన్నారు. మున్సిపల్ సమావేశం అనంతరం మున్సిపల్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లలో ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ భూములను కబ్జా చేస్తూ నిర్మాణం చేపట్టిన వాటికి ఇంటి నెంబర్‌లు కేటాయిస్తూ అవినీతికి పాల్పడ్డారని, వారిపై విజిలెన్స్ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని అందులో అర్థమేమిటని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కలెక్టర్‌తో పాటు మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ కౌన్సిలర్‌లు ఆకుల సంగీత, పాలెపు లత, సుంకరి ఈశ్వరిలు ఉన్నారు.

ఏర్గట్లలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఏర్గట్ల, మే 31: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1997-1998 బ్యాచ్ విద్యార్థులంతా ఆదివారం ఒకేచోట చేరి కలిసి సందడి చేశారు.తమతో పాటు చదివిన తోటి విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చి ఆత్మీయంగా కలుసుకొని ఒకరికొకరు వారి గత జ్ఞాప కాలను గుర్తు చేసుకున్నారు.తమకు పాఠాలు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో 1997-1998బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఉన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 1997-1998 బ్యాచ్ విద్యార్థులు